క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై అన్నపూర్ణాదేవి అలంకరణలోని దుర్గమ్మను మంగళవారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వాసిరెడ్డి పద్మను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

నృత్యవైభవాన్ని చాటుతున్న ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గానగర్‌లో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ నృత్యవైభవాన్ని చాటుతున్నాయి. మంగళవారం ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన కళాకారులు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు, ఆంధ్రనాట్యం అంశాలను ప్రదర్శించారు. దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల నృత్యవిభాగం అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాస్ బృందం అందెలరవమిది పదములుదా, ఇదిగో భద్రాద్రి అంశాలను ప్రదర్శించారు. మైలవరానికి చెందిన నాట్యకళాకారిణి ఎస్.కనకలక్ష్మి బృందం, అనూషా నాయుడు, నందికొట్కూర్‌కు చెందిన జగదీష్, విశాఖపట్నానికి చెందిన సుజన దీపిక, హైదరాబాద్‌కు చెందిన జానకి బృందాలు సంప్రదాయ నృత్యాలను అభినయించారు. సంగీత విద్వాంసుడు ప్రద్యుమ్నకుమార్ వయోలిన్‌పై సంప్రదాయ కీర్తనలను హైదరాబాద్‌కు చెందిన అనంతలక్ష్మి బృందం వీణపై వాగ్గేయకార కీర్తనలు పలికించారు. నిర్వాహకులు నృత్యకళాకారులకు ప్రశంసా పత్రాలను, అమ్మవారి లడ్డూప్రసాదాలను అందజేశారు.

అన్న కుమారుడిపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆస్తి వివాదంలో అన్న కొడుకుపై దాడి చేసిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురానికి చెందిన జద్యం విశ్వనాథం, అర్జున్ అన్నాదమ్ములు. వీరి మధ్య ఆస్తి గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో విశ్వనాథం కుమారుడు నాగసూర్య కలరా హాస్పటల్ సమీపంలోని ఉమ్మడి ఆస్తిగా ఉన్న ఇంటికి వెళ్లాడు. దీంతో అర్జున్, నాగసూర్యపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నంబర్ 173లో ఉప్పతల సునీత, యోజేంద్రబాబు భార్యభర్తలు. వీరికి 2020లో వివాహమైంది అప్పుడు కట్నకానుకలు భారీగానే ఇచ్చారు. కొంత కాలంగా యోజేంద్రబాబు మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకుని భార్యను వేధిస్తున్నాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సౌందర్య రత్నాకరి...



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

అమ్మవారికి ప్రత్యేక అర్చనలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలు పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారు పలుచోట్ల మంగళవారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారు శ్రీగాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని చత్తీస్‌ఘడ్ మాజీ స్పీకర్ ధరమ్‌లాల్ కౌశిక్, కేబీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణరావు, దుర్గగుడి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పోతిన పైడిరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు, పిల్లా శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో కళావేదికపై చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

- కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. విశేష హోమాలు చేశారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా, ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు, చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- భవానీపురం కరకట్ట ప్రాంతంలోని శ్రీ దుర్గాభవాని దేవస్థాన కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ చేయగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను దంటు భవానీశర్మ పర్యవేక్షణలో అర్చకులు నిర్వహించారు.
- భీమనవారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని కాశీ అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి పర్యవేక్షణలో పవన్ కుమార్ శర్మ పూజలు జరిపించారు.
- పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని శ్రీ లలితాంబికా పీఠంలో అమ్మవారిని అశ్వరుడాంబాదేవిగా అలంకరించారు. పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పర్యవేక్షణలో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. ఉత్సవ ఏర్పాట్లను పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య పర్యవేక్షించగా, పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో కొలువుదీరిన అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా, గాయత్రీదేవిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. సకల జీవరాశికి ఆహారాన్ని అందించే శక్తి స్వరూపిణి జగన్మాత. కేటీరోడ్డులోని శ్రీనివాసమహల్ సెంటర్‌లోని గంగానమ్మ దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఉభయదాతలతో కుంకుమార్చనలను నిర్వహింపజేశారు.

- బ్రాహ్మణవీధిలోని చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు కాశీ అన్నపూర్ణాదేవిగా భక్తులను అలరించారు. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులను దర్శనానికి అనుమతించారు.
- శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో భ్రమరాంబదేవి గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలు, చండీహోమం, ఖడ్గమాలార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగారాజు పర్యవేక్షించారు.
- బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ పద్మావతి అమ్మవారు శ్రీ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ ఘంటసాల శ్రీనివాసు పర్యవేక్షించారు.
- కృష్ణ ప్రార్థనా మందిరంలో కొలువై ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ పర్యవేక్షించారు.
- కొత్తపేట సైకం వారివీధిలోని శ్రీ దర్భేశ్వరస్వామి దేవస్థానంలో కొలువై ఉన్న పార్వతీ అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.



కేటీ రోడ్డులోని గంగానమ్మ ఆలయంలో



వన్‌టౌన్‌లో గాయత్రీదేవిగా భ్రమరాంబ



బ్రాహ్మణ వీధిలో పద్మావతీదేవి..



పాలప్రాజెక్టు వద్ద లలితాంబిక



కరకట్ట వద్ద అన్నపూర్ణాదేవిగా



కాశీ అన్నపూర్ణాదేవిగా విజయదుర్గమ్మ



చిట్టినగర్‌లో గాయత్రీదేవిగా మహాలక్ష్మి



వన్‌టౌన్‌లోఅన్నపూర్ణాదేవిగా చదును మహాలక్ష్మి

పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 40వ డివిజన్ పరిధిలోని పున్నమి ఘాట్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి అందజేస్తున్నారన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారన్నారు. పూర్తిగా వైద్యం అందే వరకు పర్యవేక్షిస్తారని తెలిపారు. శిబిరంలో 571 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి, డీఎంఅండ్ హెచ్ఓ సుహాసిని, రత్నావళి, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో 24 గంటలూ వైద్య శిబిరాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): దసరా మహోత్సవాల్లో 24 గంటలూ వైద్య శిబిరాలు అందుబాటులో ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా డీఎం హెచ్ఓ మాచర్ల సుహాసిని తెలిపారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను మంగళవారం డాక్టర సుహాసిని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ ఉత్సవాల్లో 12 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మూడు షిఫ్టుల్లో ఈ నెల 25 వరకూ నిర్వహించే శిబిరాల్లో 330 మంది వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తారన్నారు.

కొండపై రాజకీయాలు మాట్లాడటం సరికాదు

టీడీపీ, జనసేనలకు వెలంపల్లి హితవు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కొండపై రాజకీయాలు మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా మహోత్సవాలపై విపక్ష నేతల మాటలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మను మంగళవారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. అనంతరం మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ రాజకీయ విమర్శలకు దుర్గగుడి వేదిక కాదన్నారు. ఎన్నో ఏళ్లుగా వినాయకుడి గుడి నుంచే క్యూలైన్లు ఉన్నాయని, ఆ విషయం టీడీపీ, జనసేన నేతలు మర్చిపోయారన్నారు. గత ప్రభుత్వం కంటే చాలా అద్భుతంగా దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అమ్మవారి అలంకరణపై విమర్శలు చేయడమంటే కళ్లుండి చూడలేని కబోదులన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆలయాలు, గోశాలలు కూల్చివేస్తే, వాటిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి నిర్మిస్తోందని వివరించారు. దుర్గగుడి అభివృద్ధికి రూ. 70 కోట్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని తెలిపారు. త్వరలో సీఎం చేతుల మీదుగా దుర్గగుడి అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. అమ్మవారి ఆశీస్సులు ముఖ్యమంత్రి, ప్రజలందరిపై ఉండాలని అమ్మవారిని ప్రార్థించానన్నారు.

మూలా నక్షత్రం రోజున సహకరించాలి

కనకదుర్గ నగర్‌లో దుకాణదారులతో సీపీ రాణా



కనకదుర్గ నగర్‌లో మాట్లాడుతున్న సీపీ రాణా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మూలా నక్షత్రం రోజున భక్తులకు ఇబ్బంది కలగకుండా దుకాణాలు మూసివేసి పోలీసులతో సహకరించాలని సీపీ టీకే రాణా సూచించారు. కనకదుర్గ నగర్‌లోని పూజా సామగ్రి, ఫ్యాన్సీ దుకాణ యజమానులతో సీపీ టీకే రాణా మంగళవారం మాట్లాడారు. తొలుత అమ్మవారి ఆలయానికి చేరుకున్న సీపీ క్యూలైన్లో భక్తులతో మాట్లాడారు. అమ్మవారి దర్శనంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీసీ కెమెరా కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. మహా మండపం, ఆలయ పరిసరాల మీదగా కొండ దిగువకు చేరుకున్నారు. ప్రతి సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడి ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భవానీఘాట్, పున్నమి ఘాట్‌లకు చేరుకున్న సీపీ వీఐపీ వాహనాల్లో కొండపైకి చేరుకునే భక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట డీసీపీ విశాల్ గున్ని, ఏఐజీ ఎం. రవీంద్రబాబు, డీసీపీ అజిత వేజెండ్ల, ఈవో కె.ఎస్.రామారావు, క్రైం ఏడీసీపీ వెంకటరత్నం, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు సాంకేతిక ఫలాలు అందాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచవ్యాప్తంగా సాధిస్తున్న సాంకేతిక ఫలాలు సామాన్యులకు చేరువ చేయడానికి విద్యార్థులు కృషి చేయాలని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లేబరేటరీ (హైదరాబాద్) శాస్త్రవేత్త వి.రాజకుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యాన 'రక్షణ రంగంలో ఆప్టికల్ ఫైబర్ పాత్ర' అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. రాజకుమార్ మాట్లాడుతూ నిరంతర పరిశోధనలతో మానవ జీవన వికాసముంటుందన్నారు. రక్షణ రంగంలో ఆప్టికల్ ఫైబర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సమాచార వ్యవస్థను విస్తృతం చేయటానికి, సాంకేతిక పరిజ్ఞానం చాలా అండగా ఉంటుందన్నారు. కళాశాల కార్యదర్శి లక్ష్మణస్వామి మాట్లాడుతూ విద్యార్థులు మార్పులను అధ్యయనం చేయాలన్నారు. ప్రిన్సిపాల్ జె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రక్షణ రంగంలో ఉపయోగించే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆప్టికల్ ఫైబర్స్ కీలక పాత్రపై వివరించారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.రవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, విజయ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

- లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ఐటీఐ విద్యార్థుల్లో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ పెంచేలా తీర్చిదిద్దడానికి బెంగుళూరుకు చెందిన వాద్వాని ఫౌండేషన్‌తో రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ అధికారులు మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐటీ, ఆంగ్లభాషా నైపుణ్యం, సాఫ్ట్ స్కిల్స్ మెరుగుపర్చడానికి వాద్వానితో కలిసి శిక్షణ ఇవ్వనున్నారు. డైరెక్టర్ నవ్య, ఫౌండేషన్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు సునీల్ దాహియ పాల్గొన్నారు.

దసరా సందడి



దసరా.. నగరానికి సందడిని తెచ్చింది. ఉత్సవాల్లో మూడో రోజు మంగళవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకున్న భక్తజనం మది పులకించింది. దుర్గగుడి ప్రాంగణం వివిధ వర్ణాల విద్యుత్ తోరణాలతో కళకళలాడుతోంది. ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. నగరోత్సవంలో డప్పు కళాకారుల విన్యాసాలు, కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు భారతీయ నృత్య వైభవాన్ని చాటుతున్నారు. విభిన్నప్రతిభావంతులు, వృద్ధులకు వలంటీర్లు సేవలు అందించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









